సాక్షి కుమురం భీం

బుధవారం । 19 । జూన్ । 2024



పుస్తక నేస్తం.. విజ్ఞాన సర్వస్వం
మనదేశంలో ఏటా జూన్ 19న జాతీయ పఠన దినోత్సవం నిర్వహిస్తున్నారు. పుస్తక పఠనం జ్ఞానాన్ని పెంచడంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరుస్తుంది. 8లో▸



మేఘమా.. వర్షించుమా..!
జిల్లాలో చిరుజల్లులు కురుస్తున్నా భారీ వర్షాలు పడటం లేదు. రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటున్నా వరుణుడు కరుణించడం లేదు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.6 /27.6
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాలు, ఉపరితల ద్రోణి ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మెరిట్ జాబితా విడుదల

ఆసిఫాబాద్‌అర్బన్: జాతీయ ఆరోగ్య మిషన్‌లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి తుకారాం భట్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా పొరుగు సేవల ప్రాతిపదికన పోస్టుల నియామకానికి అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ జాబితాను డీఎంహెచ్‌వో కార్యాలయంలోని నోటీసు బోర్డుపై ఉంచామన్నారు. అలాగే https://asifabad.telangana.gov.in వెబ్‌సైట్‌లోనూ వివరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 19 నుంచి 25 వరకు సాయంత్రం 5 గంటలలోగా కార్యాలయంలో ఆధారాలతో సంప్రదించాలని సూచించారు.

నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి



మంత్రికి మొక్క అందిస్తున్న శ్యాంనాయక్, పురాణం సతీశ్‌కుమార్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఎక్స్‌రోడ్ నుంచి ఉట్నూర్ ఎక్స్‌రోడ్ వరకు ఫోర్‌లేన్ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్ ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందించారు. జిల్లా కేంద్రం నుంచి ఉట్నూర్, ఆదిలాబాద్ వెళ్లే ప్రయాణికులు 70 కిలోమీటర్ల రహదారిపై గుంతలతో ఇబ్బంది పడుతున్నారని, నిధులు మంజూరు చేయాలని విన్నవించారు.

డిగ్రీలో ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల 19 నుంచి 27 వరకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే ఇంటర్ పూర్తయిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తోపాటు మూడు ఫొటోలు, ఆధార్‌కార్డు, టీజీయూజీసెట్ హాల్‌టికెట్/ర్యాంక్ కార్డు, రెండు సెట్ల జిరాక్స్‌లతో రావాలని సూచించారు. కళాశాలలో బీఏ, బీఎస్సీ(బీజెడ్‌సీ), బీఎస్సీ(ఎంబీజెడ్‌సీ, బీకాం(సీఏ), బీఎస్సీ(ఎంపీసీఎస్) కోర్సులు అందుబాటులో ఉన్నాయని, అర్హత గల విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేరస్తులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న రవీందర్

ఆసిఫాబాద్‌అర్బన్: మియాపూర్‌లో బాలిక హత్య, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో బాలికపై హత్యాచారం, ఆదిలాబాద్ జిల్లాలోని ఉపాధ్యాయుడి హత్య ఘటనల్లో నేరస్తులను కఠినంగా శిక్షించాలని గోర్‌సేన జిల్లా అధ్యక్షుడు బదావత్ రవీందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోర్ బంజారా ఆడపడుచులపై నిత్యం ఏదో ఒకచోట అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 60 లక్షల వరకు ఉన్న గోర్ బంజారా, లంబాడా జాతికి అన్యాయం జరుగుతుందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిన్నారులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. సమావేశంలో గోర్‌సేన ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి వినోద్, నాయకులు అనిల్‌కుమార్, రవీందర్ జాదవ్ పాల్గొన్నారు.

కొందరికే కిసాన్ సమ్మాన్

- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో ఏటా తగ్గుతున్న లబ్ధిదారుల సంఖ్య
- పలు రకాల నిబంధనలే కారణం
- అవగాహన లేక నష్టపోతున్న అన్నదాతలు
- 17వ విడత నిధులు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- జిల్లాలో ప్రస్తుతం అర్హులు 34,827 మంది మాత్రమే..



రెబ్బెన(ఆసిఫాబాద్): రైతులకు పెట్టుబడి, ఇతర అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ప్రవేశపెట్టింది. అర్హత కలిగిన రైతులకు సంవత్సరంలో మూడు విడతలుగా రూ.2వేల చొప్పున మొత్తం రూ.6వేల నగదును నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. అయితే ఈ పథకం అమలులో ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. ఏటా రైతుల సంఖ్య పెరుగుతున్నా ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న వారి సంఖ్య మాత్రం తగ్గుతూ వస్తోంది. ప్రభుత్వం అవినీతి అక్రమాలు తావులేకుండా ప్రతీ రైతు ఆధార్ నంబర్ అనుసంధానం చేసుకోవాలనే నిబంధన విధించింది. పూర్తిస్థాయి అవగాహన లేక అనేక మంది ఆధార్ నంబర్ అనుసంధానం చేసుకోలేదు. దీంతో వారు పథకానికి దూరమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఈ పథకం ద్వారా రైతులకు 16 విడతల్లో రైతుల ఖాతాలో పెట్టుబడి సాయం జమ చేసింది. తాజాగా మంగళవారం 17వ విడత సైతం విడుదల చేయగా.. ప్రారంభంలో ఉన్న అర్హులైన రైతులతో పోల్చితే ప్రస్తుతం వారి సంఖ్య గణనీయంగా తగ్గింది.

తగ్గిన అర్హులు

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 1.38 లక్షల మంది రైతులు ఉన్నారు. చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూరాలనే లక్ష్యంతో ప్రారంభంలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ఐదెకరాల లోపు భూమి ఉన్న వారిని మాత్రమే అర్హులుగా గుర్తించారు. అప్పుడు జిల్లాలో 69,601 మంది అర్హులుగా ఉండగా.. 17వ విడతలో వారి సంఖ్య 34,827కు తగ్గిపోయింది. పథకం అమలులో ప్రభుత్వం పలు రకాల నిబంధనలు, షరతులు విధించడంతో చాలామంది పథకానికి దూరమవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లించే వారికి పథకాన్ని నిలిపివేశారు. కుటుంబంలో భార్యాభర్తలిద్దరికీ ఈ పథకాన్ని వర్తింపజేయగా.. ప్రస్తుతం కుటుంబంలో భార్య లేదా భర్తకు ఒక్కరికి మాత్రమే వర్తింపజేస్తున్నారు.

అవగాహన లేక..

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం అమలులో అవినీతి, అక్రమాలకు చోటులేకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పలు రకాల నిబంధనలు, షరతులు విధించింది. అర్హులు తప్పనిసరిగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ఐడీ నంబర్‌కు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని సూచించింది. అయితే గ్రామాల్లో నిరక్షరాసులైన రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన లేక నేటికీ వేలాది మంది ఈ కేవైసీ చేయించుకోలేదు. వ్యవసాయశాఖ అధికారులు సైతం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించడం లేదు.

కొత్త వారికి అవకాశమేది..?

కేంద్ర ప్రభుత్వం రైతులకు పంటల పెట్టుబడిలో సాయమందించేందుకు అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలో కొత్త రైతులకు అవకాశం దక్కడం లేదు. 2018– 19లో ఈ పథకాన్ని ప్రారంభించగా.. కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరి 1 వరకు పట్టా పాస్‌పుస్తకాలు ఉన్న వారికి మాత్రమే ఈ పథకం అమలు చేస్తోంది. 2019 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో వేలాది మంది రైతులు కొత్త పాస్‌పుస్తకాలు పొందారు. వారికి మళ్లీ అవకాశం కల్పించలేదు. వారు వివరాల నమోదు కోసం వ్యవసాయశాఖ అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. విరాసిత్ ద్వారా కొత్త పట్టాపాస్ పుస్తకాలు పొందిన కొత్త రైతుల పేర్లను మాత్రమే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పోర్టల్ తీసుకుంటోంది. మరణించిన తండ్రి లేదా తల్లి గతంలో పీఎం కిసాన్ పథకంలో లబ్ధి పొందితేనే వారి వారసులకు విరాసిత్ ద్వారా అందిన భూమికి పెట్టుబడి సాయం అందుతోంది. కొన్ని సంవత్సరాలుగా కొత్త పట్టా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు ఈ పథకంలో పేర్లు నమోదు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం పంటల పెట్టుబడికి ఎంతో కొంతమేర ఉపయోగకరంగా ఉంటుందని కోరుతున్నారు.

ఒక్క పైసా పడలేదు



తుంగెడలో నాకు నాలుగెకరాల భూమి ఉంది. మా ఊరిలో చాలా మందికి కేంద్రం పైసలు పడుతున్నాయి.. కానీ నాకు మాత్రం ఇప్పటివరకు ఒక్క పైసా కూడా పడలేదు. ఎందుకు పడుతలేవో కూడా తెలుస్తలేదు. సంవత్సరానికి రూ.6వేలు వస్తే పెట్టుబడికి ఉపయోగపడేవి. నాలాంటి గరీబోళ్లకు అధికారులు సాయం చేయాలి.

– అగ్గిల పద్మయ్య, తుంగెడ

కొత్తవారికి అవకాశం ఇవ్వాలి



పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో కొత్తగా పాస్ పుస్తకం పొందిన రైతులకు కూడా అవకాశం ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరికి ముందు పాస్ పుస్తకం ఉన్న వారికి మాత్రమే నగదు జమ చేస్తోంది. 2019కి ముందు నాకు 1.5 ఎకరం ఉంటే 2019లో మరో ఎకరం 30 గుంటల భూమి కొనుగోలు చేసిన. రెండింటికీ పైసలు పడుతలేవు.

– అజ్మీర లాల్‌సింగ్, రైతు, రెబ్బెన

నిబంధనల మేరకే..

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోతోంది. పథకం ప్రారంభంలో ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉండేది. ఉద్యోగులు, రూ.10వేల పింఛన్ పొందే రైతులు, ఆదాయపు పన్ను చెల్లించే పరిధిలోకి వచ్చే రైతులు, కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఈ పథకం వర్తింపు వంటి నిబంధనలతో సాయం పొందే వారి సంఖ్య తగ్గింది. ఆధార్ కార్డు అనుసంధానం లేని కారణంగా మరికొందరికి డబ్బులు జమ కావడం లేదు.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో ఈ నెల 14న ఆరేళ్ల చిన్నారిపై జరిగిన హత్యాచార ఘటనలో మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం చిన్నారి తల్లిదండ్రులు ఎల్కరి సాలక్క, మహేశ్‌కు ఆర్థికసాయం అందించాలని కోరుతూ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే కోనప్ప వినతిపత్రం అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ఇందిరమ్మ పథకంలో ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. చిన్నారి తల్లి ఇంటర్మీడియెట్ చదివినందున నిబంధనల ప్రకారం ఒప్పంద ఉద్యోగిగా అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం పిల్లలు, మహిళల సంక్షేమం, రక్షణ దిశగా పటిష్టమైన చర్యలు చేపడుతుందని తెలిపారు. రాష్ట్ర మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు ఈ ఘటనపై స్పందించి పెద్దపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.2.5 లక్షల చెక్ అందించినట్లు పేర్కొన్నారు. దహెగాం తహసీల్దార్ కవిత, అధికారులు పాల్గొన్నారు.

వివరాలు సేకరణ

దహెగాం(సిర్పూర్): పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ఘటనలో బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని కలెక్టర్ ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం మండలంలోని బాధిత కుటుంబ వివరాలను పీఆర్ ఈఈ ప్రభాకర్ సేకరించారు. ఇంటి నిర్మాణంతోపాటు ప్రభుత్వం ఒకరికి ఉద్యోగావకాశం కల్పిస్తుందని ఆయన తెలిపారు. ఎంపీడీవో రాజేందర్, పీఆర్ ఏఈ ఆత్మారాం, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు, నాయకులు ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పనిచేయడం సంతృప్తినిచ్చింది



ఎస్పీ సురేశ్‌కుమార్‌ను గజమాలతో సన్మానిస్తున్న పోలీసు అధికారులు

ఆసిఫాబాద్: ఆదివాసీ జిల్లాలో పనిచేయడం సంతృప్తినిచ్చిందని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. సైబరాబాద్ డీసీపీగా బదిలీపై వెళ్తున్న ఆయనను జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జిల్లా పోలీసు అధికారులు శాలువాలు, గజమాల, పూలదండలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నప్పుడు అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం తనతోపాటు కృషి చేసిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ పని చేసే అవకాశం రావడం, సమర్థవంతంగా పని చేసిన మధుర స్మృతులతో బదిలీపై వెళ్లడం ఆనందంగా ఉందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది రానున్న రోజుల్లో ప్రజలకు మరింత ఉత్తమ సేవలందించాలని ఆకాంక్షించారు. జిల్లా పరిధిలో పోలీసులు మీకోసం కార్యక్రమం పేరుతో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, ఏవో శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని సన్మానించిన కలెక్టర్



ఆసిఫాబాద్‌అర్బన్: డీసీపీగా బదిలీపై వెళ్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్‌ను మంగళవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్పీగా ఆయన జిల్లాలో చేసిన సేవలు ప్రజలు, అధికారులు గుర్తు పెట్టుకుంటారన్నారు. బదిలీపై వెళ్లిన చోట కూడా ఆయన తన సేవలతో గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు.

ఎస్పీకి జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కాలనీల్లో డీవైఎఫ్‌ఐ యువజన సర్వే



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: 'సమస్యలు చెప్పండి.. పోరాటం చేస్తాం.. బస్తీ బస్తీకి డీవైఎఫ్‌ఐ' అనే నినాదంతో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మంగళవారం యువజన సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంఘం అధ్యక్షుడు టీకానంద్ మాట్లాడుతూ పట్టణంలోని 20 కాలనీల్లో సర్వే చేపట్టి ప్రజలు, యువత సమస్యలపై ఈ నెల 24న అధికారులకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రోడ్లు, తాగునీరు, మురుగు కాలువలు, బోర్ల మరమ్మతులు, పింఛన్ల సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. కోచింగ్ సెంటర్లకు ఫీజులు చెల్లించలేక అనేక మంది నిరుద్యోగులు ఇళ్లలోనే చదువుకుంటున్నారని, కొంతమంది అప్పులు చేసి కోచింగ్ సెంటర్ల వెళ్లారన్నారు. జిల్లా కేంద్రంలో ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటులో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు మాలశ్రీ, కార్తీక్, ప్రవీణ్, మనోజ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

కాగజ్‌నగర్‌రూరల్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలను సద్వినియోగం చేసుకోవాలని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్‌పర్సన్ రామకృష్ణ అన్నారు. కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని విలేజ్ నం.5లో మంగళవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికకు ఆయన హాజరయ్యారు. మొత్తం 11 దరఖాస్తులు రాగా వెంటనే పరిష్కరించినట్లు ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ కంపెనీ సంస్థల సభ్యులు కిషన్, రాజాగౌడ్, ఎస్‌ఈ వాసుదేవ్, ఏఈలు కమలాకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏంటి గురూ.. ఇదీ!

- డిప్యూటేషన్‌పైనే ఉపాధ్యాయుడి ఆసక్తి!
- బోధనేతర విధులకే మొగ్గు
- గడువు తీరినా కోఆర్డినేటర్‌గానే..
- వివాదాస్పదమవుతున్న ఓ టీచర్ తీరు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే కొంతమంది ఉపాధ్యాయుల తీరు వివాదాస్పదమవుతోంది. విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా... బోధనేతర విధుల్లో ఉండేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఏళ్ల తరబడి డిప్యూటేషన్‌లోనే కొనసాగుతున్నారు. మంచిర్యాల జిల్లా తాండూరు జెడ్పీ స్కూల్‌లో పని చేస్తున్న ఓ స్కూల్ అసిస్టెంట్ చాలాకాలంగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు కోఆర్డినేటర్‌గా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నాడు. ఈ ఏడాది కూడా కోఆర్డినేటర్‌గా కొనసాగింపునకు ప్రయత్నాలు చేసుకోవడం చర్చనీయాంశమైంది. నిబంధనల ప్రకారం గడువు తీరినవారిని తమ రెగ్యులర్ విధులకు పంపించాలి. అయితే ఆ టీచర్ సేవలు మాకు కావాలని అక్కడి ఉన్నతాధికారులే కోరడం పలు అనుమానాలు తావిస్తోంది. ఎస్‌ఎస్‌ఏ చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ నుంచి అధికారికంగా ప్రొసీడింగ్స్ లేకున్నా డిప్యూటేషన్ గడువు పెంపు కోరడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అన్ని చోట్ల రద్దయినా..

రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష అభియాన్ కింద గత ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు మన బడి' ప్రస్తుత సర్కారు 'అమ్మ ఆదర్శ కమిటీ'ల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణకు కోఆర్డినేటర్/అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్స్‌ను నియమించింది. రూ.కోట్లు ఖర్చు పెట్టి చేసే పనుల సమన్వయం కోసం స్కూల్ అసిస్టెంట్ స్థాయి ఉపాధ్యాయులను మూడేళ్లు డిప్యూటేషన్ కింద నియమించింది. ఈ గడువు జూన్ 10వ తేదీతో ముగిసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 14 మంది ఉపాధ్యాయులు తమ రెగ్యులర్ స్కూళ్లకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. తాండూరు ఉపాధ్యాయుడు మాత్రం ఈ ఆదేశాలకు విరుద్ధంగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కోఆర్డినేటర్‌గా కొనసాగేందుకే ప్రయత్నాలు చేయడం గమనార్హం. గతంలో కలెక్టర్ ఓవరల్ ఇన్‌స్ట్రక్షన్స్‌తోనే ఉత్తర్వులు ఇచ్చారు. తాజాగా మళ్లీ అదే తీరుగా డిప్యూటేషన్ కోరుతూ అక్కడి అధికారులతో మంచిర్యాల డీఈవోకు లేఖ రాయించుకున్నాడు. వచ్చే డిసెంబర్ వరకు గడువు పెంచాలని అందులో కోరారు.

కలెక్టర్లకు తెలియకుండానే పొడిగింపు..

రెండు జిల్లాల జిల్లాల కలెక్టర్లకు, సమగ్ర శిక్ష అభియాన్ ఉన్నతాధికారులకు తెలియకుండానే ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ గడువు పెంచడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై కుమురంభీం ఆసిఫాబాద్ డీఈవో అశోక్‌ను సంప్రదించగా.. సీనియర్ ఎస్‌ఏగా జిల్లాలో ఎవరూ లేకపోవడం, జిల్లాలో ఇంకా పనులు పూర్తికాకపోవడంతో ప్రస్తుతం ఉన్న కోఆర్డినేటర్‌కే డిప్యూటేషన్ గడువు పెంచాలని కోరినట్లు చెప్పారు. కలెక్టర్ అనుమతితోనే కొనసాగుతున్నారని తెలిపారు. ఇక మంచిర్యాల డీఈవో యాదయ్యను వివరణ కోరగా.. ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఉత్తర్వులు వచ్చిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.


GOVERNMENT OF TELANGANA
SCHOOL EDUCATION DEPARTMENT

డిప్యూటేషన్ గడువు పొడిగించాలని ఆసిఫాబాద్ డీఈవో ఈ నెల 15న మంచిర్యాల డీఈవోకు రాసిన లేఖ

ఆ జిల్లాలో ఎవరూ లేరా?

సదరు ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ కొనసాగింపుపై తోటి ఉపాధ్యాయులే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఓ ఉపాధ్యాయ సంఘం ఫిర్యాదు చేసింది. తమ జిల్లాలో ఆ స్థాయి వారెవరు లేరా? ఉన్నతాధికారులే ఆ ఉపాధ్యాయుని కోసం లేఖ రాయడం ఏంటని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి సదరు ఉపాధ్యాయుడు 317 జీవోలో స్పౌజ్ కోటాలో ఆసిఫాబాద్ నుంచి మంచిర్యాలకు బదిలీపై వచ్చాడు. ఇప్పుడు ఆయనే మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్ జిల్లాకు డిప్యూటేషన్‌పై పని చేసేందుకు ఆసక్తి చూపడంలో అంతర్యమేమిటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నీలిమేఘాల కనువిందు



ఆకాశంలో ఓ వైపు కారు మబ్బులు.. ధారలుగా కురుస్తున్న వర్షం, మరోవైపు సూర్యాస్తమయం.. చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్ సమీపంలో మంగళవారం సూర్యుడు అస్తమిస్తుండగా ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. చూపరులకు నీలి మేఘాలు కనువిందు చేశాయి. కొద్దిరోజులుగా ఆకాశంలో మేఘాలు అన్నదాతలను ఊరిస్తుండగా.. ఆశించిన స్థాయిలో వర్షం మాత్రం కురవడం లేదు. - చింతలమానెపల్లి

తొందరపడి విత్తుకోవద్దు

రెబ్బెన(ఆసిఫాబాద్): వర్షాలు పడకముందే రైతులు తొందరపడి విత్తనాలు విత్తుకోవద్దని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. రెబ్బెన మండలం గంగాపూర్ పరిధిలో మంగళవారం పంట నమోదు సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. భూమిలో వేడి తగ్గాక విత్తుకోవడం ద్వారా మొలకశాతం మెరుగ్గా ఉంటుందన్నారు. పొడిదుక్కిలో విత్తితే సరిపడా వర్షాలు పడని పక్షంలో విత్తనాలు భూమిలోనే కుళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు రెండోసారి విత్తనాలు వేసుకోవాల్సి వస్తుందన్నారు. ఈ నెల 20లోగా వరినార్లు పోసుకోవాలని, అప్పుడే మంచి దిగుబడి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అదును దాటాక సాగు చేసే పంటల్లో ఆశించిన దిగుబడి సాధ్యం కాదన్నారు. తెగుళ్లు, చీడపీడల బెడద అధికంగా ఉంటుందని తెలిపారు. ప్రతీ పంట వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా ఏఈవోలను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాకేశ్, రైతులు పాల్గొన్నారు.



పంట పరిశీలించి స్థానిక రైతులతో సెల్ఫీ తీసుకుంటున్న డీఏవో శ్రీనివాసరావు

క్లుప్తంగా

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

లింగాపూర్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన లింగాపూర్ మండలం వంజారిగూడలో చోటు చేసుకుంది. ఏఎస్సై తులసీరాం తెలిపిన వివరాల ప్రకారం.. వంజారిగూడకు చెందిన నాగర్‌గోజే నారాయణ్(37) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై ఇంట్లో భార్య సవితతో తరచూ గొడవ పడుతున్నాడు. సోమవారం కూడా గొడవ జరగడంతో భార్య పక్కింట్లోకి వెళ్లింది. మనస్తాపం చెందిన నారాయణ్ ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని గూడెం వద్ద అక్రమంగా తరలిస్తున్న పశువులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు గూడెం వద్ద తనిఖీలు చేపట్టగా.. మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్‌కు మినీవ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న పది పశువులను పట్టుకున్నామని టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. సరైన పత్రాలు లేకపోవడంతో పశువులతోపాటు వాహనాన్ని చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. విచారణలో డ్రైవర్ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని షెమోల్ గ్రామానికి చెందిన నిరంజన్ శర్మగా, క్లీనర్ మదన్ సాకేత్‌గా గుర్తించామని పేర్కొన్నారు. వీరిద్దరూ కుకుడ గ్రామానికి చెందిన ఇర్ఫాన్ వద్ద పని చేస్తున్నారని, అతడి కోసమే పశువులను తరలిస్తున్నట్లు స్పష్టం చేశారు. వీరిద్దరిపై కేసు నమోదు చేయగా.. ఇర్ఫాన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. తనిఖీల్లో ఎస్సై వెంకటేశ్, సిబ్బంది రమేశ్, మధు, సంజీవ్ ఉన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి


జింక కళేబరం

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని ఖర్జెల్లి రేంజ్ పరిధిలో మంగళవారం కుక్కల దాడిలో ఓ జింక మృతి చెందింది. బాలాజీ అనుకోడ అటవీ బీట్ నుంచి జింక బాలాజీఅనుకోడ గ్రామ శివారులోకి వచ్చింది. కుక్కలు వెంటపడి దాడి చేయడంతో జింకకు గాయాలయ్యాయి. పాల్వాయినగర్, బాలాజీ అనుకోడ గ్రామాల మధ్య జింకను గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. తీవ్ర గాయాలతో ఉన్న జింకకు వైద్యం అందించేందుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

పుస్తకనేస్తం.. విజ్ఞాన సర్వస్వం

- పఠనం ద్వారానే విజ్ఞాన సముపార్జన
- చిన్నప్పటి నుంచే అభిరుచి ఉండాలి
- నేడు జాతీయ పఠన దినోత్సవం


నిర్మల్ జిల్లాకేంద్రంలోని గ్రంథాలయంలో పాఠకులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఒకప్పుడు పుస్తకం హస్తభూషణం.. కానీ.. నేడు ఆ స్థానాన్ని సెల్‌ఫోన్ ఆక్రమించింది. గతంలో విజ్ఞాన సముపార్జనకు పుస్తకాలే తొలి సోపానాలుగా ఉండేవి. ప్రస్తుతం అన్నింటికీ సెల్‌ఫోనే ఆధారమైంది. ఈ ఆధునిక సమాజంలో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ టీవీ, మొబైల్ ఫోన్, ఇంటర్నెట్‌కు బానిసలయ్యారు. దీంతో పుస్తక పఠనాన్ని మరిచేపోతున్నారు. 'చిరిగిన చొక్కా నైనా తొడుక్కో గాని.. ఓ మంచి పుస్తకం కొనుక్కో' అని పెద్దలు చెప్పిన మాట నేడు అంతరించిపోతోంది. పీలికలుగా ఉన్న 'మోడరన్ దుస్తులైనా వేసుకో.. చేతిలో ఓ మంచి ఆండ్రాయిడ్ ఫోన్ ఉంచుకో' అన్నట్లుగా తయారైంది నేటి యువతరం. గతంలో పుస్తకాల అధ్యయనం ఒక తపన, ఒక తీరని విజ్ఞాన దాహం.. పుస్తకాన్ని తమ జీవితాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే ఒక విజ్ఞానజ్యోతిగా భావించేవారు. ప్రస్తుతం పుస్తక పఠనానికి ప్రాధాన్యత తగ్గుతున్నా ఇప్పటికీ పుస్తకాలను నేస్తాలుగా భావించేవారూ ఉన్నారు. మనదేశంలో ఏటా జూన్ 19న జాతీయ పఠన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక కథనం..

ఇదీ నేపథ్యం..

పుస్తకాలు ప్రపంచానికి కిటికీ అని తరచుగా చెబుతారు. చదవడం అనేది ఒకరి జ్ఞానాన్ని పెంపొందించడమే కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరుస్తుంది. సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుంది. జూన్ 19న కేరళలో 'గ్రంథాలయ ఉద్యమ పితామహుడు'గా ప్రసిద్ధి చెందిన పీఎన్ పనికర్ వర్ధంతి. అతను 1990లో రాష్ట్రంలో సార్వత్రిక అక్షరాస్యతను సాధించి కేరళలో ఒక ప్రసిద్ధ సాంస్కృతిక ఉద్యమాన్ని ప్రేరేపించి, వివిధ కార్యకలాపాలను ప్రోత్సహించారు. 2004 జూన్ 21న భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ అతడి జ్ఞాపకార్థం స్మారక పోస్టల్ స్టాంపును విడుదల చేసి గౌరవించింది. 2017లో ప్రధాని నరేంద్రమోదీ 'నేషనల్ రీడింగ్ మంత్'ను ప్రారంభించారు. ఈ పఠన మాసం జాతీయ పఠన దినోత్సవంతో ప్రారంభమవుతుంది.

పఠన ప్రయోజనాలెన్నో..

సంస్కృతులు, తరాలకు వారధిగా ఉండే అనుభవంగా పఠనాన్ని గుర్తిస్తారు. ఇది సాహిత్యంలోతైన శక్తిని మనకు గుర్తు చేస్తుంది. పుస్తకాల ద్వారా, మనం విభిన్న దృక్కోణాలను అన్వేషించవచ్చు. విభిన్న పాత్రలతో సహానుభూతిని పొందవచ్చు.

- ఒంటరితనం పారదోలి మంచి స్నేహితులుగా పుస్తకాలు వ్యవహరిస్తాయి. నైరాశ్యం దరిచేరదు.
- ఏకాగ్రత పెరుగుతుంది. శ్రద్ధగా చదవడం అలవాటవుతుంది.
- 'పద సంపద' వృద్ధిచెంది భాషపై పట్టు పెరుగుతుంది. చక్కటి భావవ్యక్తీకరణకు దోహదం చేస్తుంది.
- మెదడు పనితీరు మెరుగుపడుతుంది.
- ప్రాపంచిక విషయాలు తెలుస్తాయి. వాటిద్వారా మన లోకజ్ఞానం రెట్టింపవుతుంది.
- మానసికంగా దృఢంగా అయ్యేందుకు దోహదపడుతుంది.
- సృజనాత్మకత పెంపొందించడానికి పుస్తకాల్లోని విషయ పరిజ్ఞానం తోడ్పడుతుంది.
- విజేతల ఆత్మకథలు చదివినప్పుడు స్ఫూర్తి, ప్రేరణ పొందవచ్చు.
- పరాజితుల అనుభవాలు సమస్యలకు పరిష్కార మార్గాలు చూపిస్తాయి. ఒత్తిడిని తగ్గించడానికి పుస్తక పఠనం దివ్యౌషధంగా పనిచేస్తుంది.

పిల్లల్లో పఠనాసక్తి పెంచండిలా..

- రోజువారీపనుల్లో తీరికలేకుండా ఉన్నా కనీసం 10నిమిషాలు పుస్తక పఠనానికి కేటాయించాలి.
- తొలుత నచ్చిన పుస్తకం, తక్కువ పేజీలున్నవి ఎంపిక చేసుకుంటే ఆసక్తి పెరుగుతుంది.
- ఎక్కువ పేజీలున్నవైతే రోజుకు పది పేజీల చొప్పున పూర్తిచేస్తే ఏడాదిలో 200 పేజీలున్న 18 పుస్తకాలు చదవొచ్చు.
- రోజువారీ పనుల్లో విరామం దొరికినప్పుడు కాలక్షేపం కోసం పఠించాలి.
- చిన్నారులతో చందమామ కథలు, బాలవికాస పుస్తకాల్ని చదివించాలి.

అందుబాటులో అన్ని పుస్తకాలు

నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండల కేంద్రాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం శాఖ గ్రంథాలయాలు కొనసాగుతున్నాయి. జిల్లాలో ప్రధాన గ్రంథాలయంతోపాటు 16 మండల కేంద్రాల్లో శాఖ గ్రంథాలయాలున్నాయి. వీటిలో దిన, వార, మాసపత్రికలతోపాటు కథల పుస్తకాలు, నవలలు, విజ్ఞాన సంబంధిత పుస్తకాలున్నాయి. వీటిని సభ్యత్వం తీసుకోవడం ద్వారా చదువుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా సభ్యత్వం నమోదు చేసుకున్న పాఠకులు దాదాపు 18వేలకు పైగా ఉన్నట్లు గ్రంథాలయశాఖ అధికారులు చెబుతున్నారు. నిర్మల్ పట్టణంలో కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠకుల కోసం అన్నిరకాల పుస్తకాలతో ఉచిత గ్రంథాలయ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నారు.


ఇంటినే గ్రంథాలయంగా..



ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నాకు చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదివే అభిరుచి ఉంది. మిత్రులు, సాహితీవేత్తలు కానుకగా ఇచ్చిన పుస్తకాలతో ఇంట్లో చిన్నపాటి గ్రంథాలయం ఏర్పాటైంది. సమయం దొరికినప్పుడల్లా చదువుతూ కాలక్షేపం చేస్తా. పిల్లలకు చిన్నప్పటినుంచే పుస్తకపఠనాన్ని అలవాటు చేయాలి.

– అంబటి నారాయణ, సాహితీవేత్త, నిర్మల్

కాస్త సమయం దొరికినా..



ఢిల్లీలోని కెనడా రాయబార కార్యాలయంలో సీనియర్ సలహాదారుగా పనిచేసి రిటైర్డ్ అయ్యాను. నాలుగు దశాబ్దాలుగా పుస్తకాలనే నేస్తాలుగా భావిస్తూ జీవనం సాగిస్తున్నాను. పుస్తక పఠనం ద్వారా మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. నేటి యువతరం చిన్నప్పటి నుంచే పుస్తక పఠనాన్ని అభిరుచిగా మలుచుకోవాలి.

– డాక్టర్ సంపత్‌కుమార్, రచయిత, నిర్మల్

లక్ష్యానికి చేరువచేసేది..



పిల్లలకు చిన్నప్పటి నుంచే పుస్తకపఠనాన్ని అలవాటు చేయాలి. పెద్దయ్యాక ఈ అభిరుచి లక్ష్యాలకు చేరువచేస్తుంది. పుస్తక పఠనంతో విజ్ఞానంతో పాటు మానసిక స్థిరత్వం కూడా కలుగుతుంది. టీవీ, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలి. పుస్తక పఠనం అలవాటు పెంచుకుంటే ఎన్నో ప్రయోజనాలున్నాయి.

– సాయిప్రసన్న, ఎంబీబీఎస్ ఫస్టియర్, చించోలి బీ

అన్ని పుస్తకాలు ఉంచాం



విద్యార్థులు, యువత పుస్తక పఠనాభిరుచిని పెంచుకోవాలి. ఉద్యోగాల సాధనకు ప్రిపేర్ అవుతున్నవారికి జిల్లాకేంద్రంలోని ప్రధాన గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఆయా మండల కేంద్రాల్లోనూ పుస్తకాలు అందుబాటులో ఉంచాం.

– విజయశ్రీ, గ్రంథాలయాధికారి–గ్రేడ్ 2, నిర్మల్ జిల్లా కేంద్ర గ్రంథాలయం

వద్దనుకున్న బిడ్డ... ఎంత ముద్దుగా ఉందో..


శిశుగృహాలో పెరుగుతున్న బిడ్డ

జన్నారం: పేగు తెంచుకుని పుట్టిన బిడ్డను ఓ తల్లి కాదనుకుని చెత్తకుప్పలో పడేసింది. ఆ బిడ్డను అక్కున చేర్చుకున్న ఐసీడీఎస్.. ముద్దుగా తయారు చేసింది. జన్నారం మండల కేంద్రంలోని ధర్మారం రోడ్డు కాలువ సమీపంలో గత నెల 6న మాతృత్వాన్ని మరిచిన ఓ తల్లి అప్పుడే పుట్టిన బిడ్డను చెత్తకుప్పలో పడేసింది. ఆ పాపను ప్రవీణ్ అనే వ్యక్తి గుర్తించి 100 డయల్ చేయడంతో పోలీసులు శిశువును ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. ఎండకు పాప అనారోగ్యానికి గురికావడంతో మంచిర్యాల ఆస్పత్రిలో 15 రోజులు చికిత్స అందించారు. కోలుకున్న తర్వాత ఆదిలాబాద్‌లోని శిశుగృహకు తరలించారు. శిశు గృహలో అక్కడి అధికారుల పర్యవేక్షణలో బిడ్డ బాగయినట్లు ఐసీడీఎస్ సీడీపీవో రేష్మా తెలిపారు. ఈ పాపను మరో 5 నెలల్లో దత్తత తీసుకునేందుకు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

బొగ్గు గనులను సింగరేణికే ఇవ్వాలి

కాసిపేట:రాష్ట్రంలోని బొగ్గు గనులను సింగరేణికే ఇవ్వాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ డిమాండ్ చేశారు. సోమగూడెంలో మంగళవారం మాట్లాడారు. కేంద్రం బొగ్గు గనులను టెండర్ ద్వారా ప్రైవేట్ వారికి అప్పగించే చర్యలను ఖండించారు. ప్రైవేట్ వారికి ఇస్తే సింగరేణి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు సింగరేణి జోలికి రామని చెప్పిన మోదీ, కిషన్‌రెడ్డి ప్రస్తుతం బొగ్గుశాఖ మంత్రి కాగానే వేలం వేసి గనులను బడా కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. టెండర్ ఆలోచనను విరమించుకోకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఖర్జెల్లి ప్రధానోపాధ్యాయుడిపై విచారణ

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని ఖర్జెల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మొహిసిన్‌పై మంగళవారం శాఖాపరమైన విచారణ చేపట్టారు. విధుల్లో నిర్లక్ష్యం వహించడమే కాకుండా నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ఉపాధ్యాయుడు మహేందర్ ఇచ్చిన ఫిర్యాదుతో డీఈవో ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ఎంఈవో సోమయ్య పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. పాఠశాల నుంచి డిప్యుటేషన్‌పై నలుగుపల్లి పాఠశాలకు వెళ్లి, ఆరు నెలలపాటు అక్కడ విధులు నిర్వర్తించినట్లు తప్పుడు రికార్డులు సృష్టించాడని ఫిర్యాదులో పేర్కొనడంతో.. దానికి సంబంధించిన సాక్ష్యాలను ఉపాధ్యాయుడు మహేందర్ అందించారు. విచారణ పూర్తి చేసినట్లు రశీదు ఇవ్వాలని మహేందర్ కోరగా ఎంఈవో నిరాకరించారు. గతంలోనూ మొహిసిన్‌పై ఆరోపణలు రాగా, పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులు గొడవ పడ్డారు. పాఠశాలలో 12 కంప్యూటర్లు మంజూరు కాగా ప్రస్తుతం మూడు మాత్రమే ఉన్నాయని విద్యార్థులు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడే కంప్యూటర్లను బయటి వారికి విక్రయించినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఎంఈవో సైతం అవినీతికి పాల్పడే ఉపాధ్యాయులకు మద్దతుగా ఉంటున్నారని పలువురు ఉపాధ్యాయులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఏప్రిల్ 23నే విచారణ చేపట్టాలని ఆదేశాలు వచ్చినా రెండు నెలలపాటు జాప్యం చేశారని ఫిర్యాదుదారుడు మహేందర్ ఆరోపించాడు. విచారణ వివరాలను వెల్లడిస్తామని ఎంఈవో తెలిపినా, విచారణ అనంతరం అందుబాటులో లేకుండా పోయారు. 'ఫోన్'లో సంప్రదించగా ఆయన ఫోన్ స్విచాఫ్ ఉంది.

కార్మికుల సమస్యలపై సీఎండీకి వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న జనక్ ప్రసాద్

శ్రీరాంపూర్: కార్మికుల సమస్యలపై సింగరేణి సీఎండీ బలరాంకు ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ మంగళవారం వినతిపత్రం అందించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీని కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్మికులకు సంతింటి పథకం అమలు చేయాలన్నారు. ఇందులో భాగంగా కంపెనీ ప్లాట్లు ఏర్పాటు చేసి ఇంటి స్థలాలు కేటాయించాలన్నారు. పెర్క్స్‌పై ఆదాయ పన్ను యాజమాన్యమే రీయింబర్స్‌మెంట్ చేయాలని సూచించారు. కొత్తగనులు తీసుకురావాలని, దీని కోసం కేంద్ర ప్రభుత్వ అనుమతుల కోసం ప్రయత్నించాలన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి, థర్మల్ విద్యుత్‌తోపాటు సోలార్, విండ్ పవర్‌లో రాణిస్తున్నట్లుగానే ఇతర ఖనిజాలను అన్వేషించి వాటిని ఉత్పత్తి చేయడానికి కృషి చేయాలని కోరారు.

పారదర్శకంగా ఈపీ ఆపరేటర్ ట్రైనీల ఎంపిక

మందమర్రిరూరల్/శ్రీరాంపూర్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో, శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో ఈపీ ఆపరేటర్ ట్రైనీల ఎంపిక ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. మందమర్రిలో రెండు రోజులు, శ్రీరాంపూర్‌లో నాలుగు రోజులు పరీక్షలు నిర్వహిస్తారు. మంద్రమర్రిల్లో ఏరియా జీఎం మనోహర్, శ్రీరాంపూర్‌లో ఎస్‌ఓటూ జీఎం పురుషోత్తంరెడ్డి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈపీ ఆపరేటర్ ట్రైనీల ఎంపిక ప్రక్రియ పరీక్ష పారదర్శకంగా, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీ అభ్యర్థి డ్రైవ్ చేసే క్రమంలో వీడియో తీయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. ప్ర తీ అభ్యర్థి డ్రైవ్ తీరును ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్ దగ్గరుండి పరిశీలించారు. బెల్లంపల్లి రీజియన్ పరిధిలో 187 మంది దరఖాస్తు చేసుకోగా మంగళవారం 100 మంది ఎంపిక పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. 90 మందే హాజరయ్యారు. వీరిలో 46 మంది ఉత్తీర్ణత సాధించారు. శ్రీరాంపూర్‌లో మొదటి రోజు 135 మందికి 124 మంది హాజరు కాగా 65 మంది డ్రైవింగ్ టెస్ట్ పాసై రాత పరీక్షకు అర్హత సాధించారు. మందమర్రిలో మిగిలిన వారికి బుధవారం, శ్రీరాంపూర్‌లో మరో మూడు రోజులు ఎంపిక పరీక్షలు ఉంటాయని వెల్లడించారు. డ్రైవింగ్ టెస్ట్ పాస్ అయిన వారికి కొత్తగూడెంలో రాత పరీక్ష ఉంటుందని తెలిపారు.

మద్యం మత్తులో అన్నదమ్ముల ఘర్షణ

- విచక్షణ కోల్పోయి తమ్ముడిని కర్రతో కొట్టి చంపిన అన్న


విజయ్ (ఫైల్)

నస్పూర్: మంచిర్యాల జిల్లా నస్పూర్ పట్టణ పరిధిలోని సీసీసీ గాంధీనగర్‌కు చెందిన కుంచం రాజం–రాజమ్మ దంపతులకు ఆరుగురు కుమారులు ఉన్నారు. అందరూ కూలీ పనులు చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఐదో కుమారుడు రాము, ఆరోవాడు విజయ్(22) నిత్యం ఒకేచోటుకు కూలీ పనులకు వెళ్తుంటారు. వచ్చిన డబ్బులతో కలిసి మద్యం సేవిస్తుంటారు. సోమవారం రాత్రి ఇద్దరూ అన్నదమ్ములు అతిగా మద్యం సేవించారు. భోజనం చేస్తుండగా ఇద్దరూ గొడవ పడ్డారు. ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. మద్యం మత్తులో రాము విజయ్ తలపై కర్రతో విచక్షణ రహితంగా కొట్టడంతో అధిక రక్తస్రావంతో అక్కడే మృతి చెందాడు. స్థానికులు మంగళవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, ఎస్సై రవికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాల సేకరించారు. మృతుడి అన్న సందానందం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'సివిల్స్' ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: సివిల్ సర్వీసెస్ లాంగ్‌టర్మ్–2025 (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) పరీక్ష ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజాలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఈనెల 19 నుంచి జూలై 3 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. శిక్షణ తరగతులు జూలై 18 నుంచి ప్రారంభమై 2025 ఏప్రిల్ 18 వరకు కొనసాగుతాయని తెలిపారు. మొత్తం 150 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనుండగా, అందులో 100 మందిని 2024 జూలై 7న నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. 50 మంది అభ్యర్థులను ఇంతకుముందు యూపీఎస్సీ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారిని తీసుకోనున్నట్లు తెలిపారు. వారు సంబంధిత పత్రాలతో జూలై 3లోగా నేరుగా టీజీబీసీ స్టడీ సర్కిల్ లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్ 500059 చిరునామాలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు వసతి,భోజన, రవాణాకోసం నెలకు రూ.5వేలు, మరో రూ.5వేలు బుక్ ఫండ్ నిమిత్తం ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రంథాలయ సదుపాయం కూడా ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ హైదరాబాద్‌లో ఉంటుందని వివరించారు. వివరాలకు08732–221280లో సంప్రదించాలని కోరారు.

గ్రూప్–2 ఉచిత గ్రాండ్ టెస్ట్‌ల కోసం..

టీజీపీఎస్సీ గ్రూప్–2 ఉద్యోగా లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల నుంచి ఉచిత గ్రాండ్ టెస్ట్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజాలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గ్రూ ప్–2 అభ్యర్థులకు నాలుగు ఉచిత గ్రాండ్ టెస్టులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి టెస్ట్‌లో భా గంగా జూలై 8న ఉదయం 10 గంటలకు పేపర్–1, మధ్యాహ్నం 1.30 గంటలకు పేపర్–2 ఉంటుందని పేర్కొన్నారు. అలాగే 9న ఉదయం 10 గంటలకు పేపర్–3, మధ్యాహ్నం 1.30 గంటలకు పేపర్–4 ఉంటాయని తెలిపారు. ఇదే పద్ధతిన రెండో టెస్ట్ జూలై 15, 16 తేదీల్లో, మూడో టెస్టు జూలై 22, 23 తేదీల్లో, నాల్గో టెస్ట్ జూలై 30, 31 తేదీల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 19 నుంచి జూలై 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 08732–221280 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కుల గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

పాత మంచిర్యాల: బీసీ కుల గణన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ కోరారు. కుల గణన చేపట్టాలని జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీల కుల గణన నిర్వహించిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే బీసీ కుల గణన చేసి బీసీలకు రిజర్వేషన్ 42 శాతంగా పెంచుతామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. ప్రస్తుతం రాష్ట్ర జనాభాలో 56 శాతంగా ఉన్న బీసీలకు కేవలం 18 శాతం రిజర్వేషన్ ఉందన్నారు. కార్యక్రమంలో తుల మధుసూదన్, కర్రె లచ్చన్న, నెన్నెల నర్సయ్య, అక్కల రమేశ్, కీర్తి భిక్షపతి, ఆరెందుల రాజేశం, చంద్రమౌళి, సతీశ్, లక్ష్మణ్, ధర్మాజీ, కొంతం రాజు పాల్గొన్నారు.


ఉద్యోగుల కృషితోనే ఆర్టీసీ ప్రగతి

- సంస్థ రీజినల్ మేనేజర్ సోలోమన్
- 'ఉత్తమ' అవార్డుల ప్రదానం


అవార్డులు పొందిన ఉద్యోగులతో ఆర్‌ఎం, డిప్యూటీ ఆర్‌ఎంలు, డీఎంలు

ఆదిలాబాద్: ఉద్యోగుల నిరంతర కృషితోనే ఆర్టీసీ ప్రగతి సాధ్యమని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో రీజియన్ త్రైమాసిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉద్యోగులు ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. సంస్థ అభివృద్ధి కోసం పాటుపడే వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ఇందులో భాగంగానే వివిధ ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇదే ఉత్సాహంతో మిగతా వారు సైతం మెరుగైన సేవలు అందించేలా శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంవోలు ప్రణీత్, ప్రవీణ్ కుమార్, డిపో మేనేజర్లు కల్పన ప్రతిమారెడ్డి, విశ్వనాథ్, రవీంద్రనాథ్, పర్సనల్ ఆఫీసర్ జిబ్లా, కిరణ్, ఎంఎఫ్ శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో లాభాలు


నానో యూరియా ప్లస్‌ను లాంచ్ చేస్తున్న అధికారులు

కడెం: నానో యూరియాతో అనేక లాభాలున్నాయని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఉమ్మడి జిల్లా పీఏసీఎస్ సీఈవోలతో మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో నిర్వహించిన నానో యూరియా అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇఫ్కో నానో యూరియా కీటకాలు, తెగుళ్ల ఉధృతిని తగ్గిస్తుందని తెలిపారు. ఉత్పత్తి, ఆదాయాన్ని పెంచుతూ నేల, గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గిస్తుందని పేర్కొన్నారు. నానో యూరియా నిల్వ చేయడం, రవాణా చేయడం సులభతరమని తెలిపారు. అంతకుముందు నానో యూరియా ప్లస్, నానో డీఏపీలను లాంచ్ చేశారు. అనంతరం ఇఫ్కో తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ కృపాకర్ మాట్లాడుతూ.. ఇఫ్కో ద్వారా రైతులకు సబ్సిడీపై డ్రోన్‌తో స్ప్రే చేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో యాభై వేల ఎకరాల్లో డ్రోన్‌తో స్ప్రే చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీసీవో మోహన్, ఉమ్మడి జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్లు బాలవికాస్, శ్రీధర్, పీఏసీఎస్ సీఈవోలు తదితరులున్నారు.

రైతులు సంఘాలు ఏర్పాటు చేసుకోవాలి


మోదీ మాటలను వివరిస్తున్న శివకృష్ణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్):రైతులు సంఘాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కోట శివకృష్ణ అన్నారు. హాజీపూర్‌లోని రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషివిజ్ఞన కేంద్రం ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు, రైతులతో శాస్త్రవేత్తలు మంగళవారం చర్చాగోష్ఠి నిర్వహించారు. శివకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను రైతులతో నేరుగా చర్చించేందుకే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. వానాకాలంలో సాగు చేసే ప్రధాన పంటల సాగులో చేపట్టాల్సిన జాగ్రత్తలపైనా అవగాహన కల్పించారు. పత్తి సాగు, పత్తిలో అంతర పంటలసాగు, చిరుధాన్యాల సాగు, పెరటిలో కూరగాయల సాగు, భూసార పరీక్ష ఆధారిత ఎరువులు, క్రిమి సంహార మందుల వాడకం గురించి వివరించారు. రైతు సంఘాల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రజల జీవితాల్లో తీసుకు వచ్చిన మార్పులను, ప్రధాని మోదీ రైతుల గుర్తించి మాట్లాడిన ఉపన్యాసాన్ని లైవ్ వెబ్‌కాస్టింగ్ ద్వారా చూపించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీసీ సలహాదారు గోనె శ్యాంసుందర్‌రావు, అధ్యక్షుడు వినయ్‌ప్రకాశ్‌రావు, డైరెక్టర్లు పూ స్కారి శ్రీనివాసరావు, బొడ్డు శంకర్, బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపతి, నాగరాజు, ఎఫ్‌పీసీ మాజీ అధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి శ్రీను, ఎఫ్‌పీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.